ప్రజాశక్తి

శనివారం 27 ఏప్రిల్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ఎన్నికల్లో పోటీకి
158 మంది అర్హులు

- 48 నామినేషన్ల తిరస్కరణ
- 14,306 మందికి ఎన్నికల విధుల కేటాయింపు
- జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ వెల్లడి

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్, జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన అనంతరం మొత్తం 158 మంది అభ్యర్థులను పోటీకి అర్హులుగా గుర్తించామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ.ఎస్. దినేష్ కుమార్ ప్రకటించారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం సంబంధిత వివరాలను ఆయన మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి మొత్తం 206 మంది అభ్యర్థులు 354 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. వీటిని పరిశీలించిన అనంతరం 48 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు అవకాశం ఉంటుందన్నారు. ఉపసంహరణల అనంతరం నిబంధనల ప్రకారం అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయిస్తామని తెలిపారు. జిల్లాలో ఈ నెల 25వ తేదీ వరకు 18,22,470 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. పోటీచేసే అభ్యర్థులు 15 కంటే ఎక్కువగా ఉంటే ఈ నెల 30వ తేదీన రాజకీయ పార్టీల సమక్షంలో ఈవిఎంలకు మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. మే 2న అబ్జర్వర్, పోటీ చేసే అభ్యర్థుల సమక్షంలో రెండోవిడత ర్యాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. మే 3 నుంచి 7వతేదీ వరకు రాజకీయ పార్టీల సమక్షంలో ఈవిఎంల కమిషనింగ్ ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన అనంతరం ఇప్పటివరకు ఉద్యోగులు, రాజకీయపార్టీలు, వాలంటీర్లు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించారంటూ జిల్లాలో 184 పత్రికా కథనాలు ▶ 2లో

గెలుపే లక్ష్యంగా..

- పదునెక్కుతున్న వ్యూహాలు
- చేరికలతో బలం పెంచుకునేందుకు అభ్యర్థుల వ్యూహం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నామినేషన్ల ఘట్టం ముగిసింది. మిగతా ప్రక్రియలు యథాతదంగా జరిగిపోతాయి. పోలింగ్ సమయం దగ్గర పడుతోంది. అభ్యర్థులు గెలుపు కోసం అన్నివిధాలా పావులు కదుపుతున్నారు. గట్టి పోటీ ఉందన్న నియోజకవర్గాల్లో ప్రధానపార్టీల అభ్యర్థులు నిద్ర లేకుండా ఎన్నికల వ్యూహాల్లోనే ఉన్నారు. ఎక్కడ రాబట్టుకోవాలన్న దానిపైనే కేంద్రీకరించారు. దూరమైన వర్గాలను తిరిగి ఏదోరకంగా ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాల్లో ఉన్నారు. ఎక్కడ చూసినా గట్టి ఫైట్ అనే చర్చ సాగుతోంది.

కొన్ని నియోజకవర్గాల్లో వైసిపికి సానుకూలత ఉందని అంచనాలుండగా.. మరికొన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం ముందుందనే ప్రచారం ఉంది. అభ్యర్థులకు మాత్రం తమ పరిస్థితి ఏమిటన్నది సుస్పష్టంగా ఉంది. ఎంత మైనస్‌లో ఉన్నాం? అన్నది తెలుసు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రచారం ఒకెత్తయితే తెరచాటు సాగే మంతనాలు, కీలకమైన నేతలను రాబట్టుకోవడం బలాలను పెంచుకోవడం కీలకంగా మారింది. ఇవే ఇప్పుడు అభ్యర్థులకు బలాన్ని పెంచుతోంది. గత ఎన్నికలకూ ఈ ఎన్నికలకు సమీకరణల్లో మార్పులు స్పష్టంగా ఉన్నాయి. తెలుగుదేశం, జనసేనతో పాటు బిజెపితో జతకట్టింది. దీని వల్ల ఏఏ వర్గాలు అదనంగా కూటమికి కలుస్తాయి? ఏ వర్గాలు దూరమవుతాయనే విశ్లేషణలు ముందుకు వచ్చాయి. వీటి ఆధారంగా వైసిపికి

శింగరాయకొండలో శుక్రవారం నాడు టిడిపిలో చేరుతున్న 120 కుటుంబాలు

కొన్ని వర్గాలు దూరమయ్యాయని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. జనసేన వల్ల నష్టం కలుగుతుందనే అంచనాల్లోనే ఉన్నారు. మూడు పార్టీలు కూటమిగా మారడంతో జరిగే నష్టాలపై వైసిపి నేతలు తర్జనభర్జన పడుతున్నారు. అదే సమయంలో ముస్లిముల ఓట్లు పెరుగుతాయనే ధీమాలో ఉన్నారు. ఏదేమైనా సమీకరణల్లో మార్పులు అనివార్యమయ్యాయి. ఇప్పుడు ఈ లోటుపాట్లపైనే అభ్యర్థులు దృష్టి సారించారు. గత ఎన్నికల్లో మనకు పడ్డ ఓట్లులో ఏఏ వర్గాలు ఇప్పుడు జారిపోయాయనే దానిపై విశ్లేషణలు చేసుకుంటున్నారు. కొత్త వర్గాలపై దృష్టి పెట్టి వాటిని ఏదో రకంగా భర్తీ చేసుకోవాలనే యోచనలో పడ్డారు. ఇందుకోసం వ్యూహాలు పన్నుతున్నారు. అవసరమైతే ఎంతటి ప్రలోభాలకైనా వెనుకాడకూడదనే భావనకు వచ్చేశారు. ఈ ప్రక్రియ మాత్రం రెండు పార్టీల్లో కనిపిస్తోంది. ఇటీవల కాలంలో చేరికలు గిద్దలూరు, కనిగిరి, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో తెలుగుదేశంలోకి ఎక్కువగా ఉన్నాయి. ఒంగోలులో మిశ్రమంగా ఉన్నాయి. రెండు పార్టీల్లో కనిపిస్తున్నాయి. అటూఇటూ పోతున్నారు. పట్టణంలో ద్వితీయశ్రేణి నేతల నాడి ఎవరికీ అంతుచిక్కడం లేదు. బలాబలాల్లో మాత్రం మార్పులు కనిపిస్తున్నాయి. జనసేన రాకతో కొంత బలం పెరిగిందనే అంచనాల్లో తెలుగుదేశం అభ్యర్థి దామచర్ల భావిస్తున్నారు. ఇళ్ల స్థలాలు ఇచ్చినందున తనకు కలిసివస్తుందనే భావనలో వైసిపి అభ్యర్థి బాలినేని ఉన్నారు. ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ బలాబలాలపై విశ్లేషణలు సాగుతున్నాయి. అధిష్టానాల నుంచీ ఎప్పటికప్పుడు తమ పరిస్థితి ఎలా ఉందో అభ్యర్థులకు సమాచారం ఇస్తున్నారు. వాటి ఆధారంగానే బలం పెంచుకునే వ్యూహం నడుపుతున్నారు. ఇప్పటికీ చేరికలు పేరుతో ప్యాకేజీలు ఇచ్చి ద్వితీయశ్రేణి నేతలను చేర్చుకుంటున్నారు. ఇవి నిరంతరం ▶ 2లో

రైతులకు సాగునీరు ఇవ్వలేని..
ప్రభుత్వాన్ని సాగనంపాలి..

- రాష్ట్ర భవిష్యత్తుకు ఎన్నికలే గీటురాయి
- పర్చూరు ఎమ్మెల్యే, టిడిపి అభ్యర్థి ఏలూరి

కుంకులమర్రులో ఏలూరిని గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

అన్నదాతలకు సాగునీరు ఇవ్వలేని దుస్థితిలో ఉన్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు కోరారు. శుక్రవారం ఇసుకదర్శి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం లోని అడుసుమల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అడ్డగడ్డ వెంకటేశ్వర్లు స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఏలూరి మాట్లాడుతూ జరగనున్న ఎన్నికలు ఒక వ్యక్తి గెలుపు ఓటములకు సంబంధించినవి కావని, రాష్ట్ర భవిష్యత్తుకు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించినవి అన్నారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను సరిచేసుకోవడానికి, కోల్పోయిన ఉజ్వల భవిష్యత్తును తిరిగి పొందడానికి ఈ ఎన్నికలే గీటురాయి అన్నారు. పర్చూరు మండలం అడుసుమల్లి, మార్టూరు, వలపర్ల గ్రామాల నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కుంకలమర్రులో ఏలూరికి నీరాజనం

కారంచేడు: మండలంలోని కుంకలమర్రులో టిడిపి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్లబండిపై ఏలూరి ఊరేగింపుగా రాగా ప్రజలు ఎదురేగి ఘన స్వాగతం పలికి గ్రామంలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఏలూరి కుంకలమర్రు గ్రామ ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. హారతులిస్తూ దీవెనలు అందిస్తూ.. విజయ కేతనం చూపుతూ తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు తిరుమలశెట్టి శ్రీహరి, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బంగారు బాబు, రావి శేషయ్య, వీరయ్య, సుబ్బరాయుడు, రాఘవయ్య, షేక్ ఖాసిం పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఆమంచి నామినేషన్

చీరాలలో 2 నామినేషన్లపై రాని స్పష్టత

ప్రజాశక్తి-చీరాల

చీరాల నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 39 నామినేషన్లు దాఖలయ్యాయి. 23 మంది అభ్యర్థులతో ఈ నామినేషన్లు నమోదు చేయబడ్డాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చీరాల అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్‌పై ఆయనకు చెందిన రొయ్యల చెరువులకు సంబంధించి రూ.కోట్లల్లో బకాయిలు ఉన్నాయని జర్నలిస్టు నాగార్జునరెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమంచి నామినేషన్‌ను ఆర్ఒ తాత్కాలికంగా నిలుపుదల చేశారు. నామినేషన్ పేపర్లలో, అఫిడవిట్‌లలో వివరాలు సరిగ్గా పొందపరచలేదన్నారు. పూర్తి ఆధారాలను సంబంధిత శాఖ అధికారుల ద్వారా నిరూపించేందుకు శనివారం ఉదయం 10 గంటల వరకు అవకాశం కల్పించామని, ఆపై ఎలక్షన్ కమిషన్ సూచనలను పాటిస్తామని ఆమంచికి, ఫిర్యాదుదారుకు ఆర్ఒ స్పష్టం చేశారు. మరో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ కూడా వివరాలు సరిగ్గా లేకపోవడంతో పెండింగ్‌లో పెట్టినట్లు తెలిపారు. ఈ రెండు నామినేషన్ల వివరాలూ ఒకేసారి వెల్లడిస్తామన్నారు.


మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి

వైసిపి ప్రభుత్వంలో
కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలు

3లో ▶

గెలుపే లక్ష్యంగా..

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతూనే ఉన్నాయి. ఒక నేత వల్ల వంద ఓట్లు వస్తాయంటే ఆ నేత ఎవరైనా వెంటనే రాబట్టుకునే పనిలో ఉన్నారు. గ్రామాల్లో బలాబలాల్లో మార్పులకు ఇవే దోహదం చేస్తున్నాయి. ఇక ప్రచారం కూడా ముమ్మరంగా సాగుతోంది. అభ్యర్థులకు మద్దతుగా వారి కుటుంబీకులు కూడా రంగంలోకి దిగి జనంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు.

ఎన్నికల్లో పోటీకి 158 మంది అర్హులు..

(మొదటిపేజీ తరువాయి)

వచ్చాయని కలెక్టర్ వివరించారు. వీటిలో 173 కథనాలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకొని సంబంధిత నివేదికను సిఈఒకు పంపించామన్నారు. జిల్లాలో సి-విజిల్ యాప్ ద్వారా 772 ఫిర్యాదులు వచ్చాయని, ఒక్కో ఫిర్యాదును సగటున 32-40 నిమిషాల వ్యవధిలో పరిశీలించామని తెలిపారు. జిల్లాలో ఈ నెల 26వ తేదీ వరకు రూ.2,21,90,514 విలువైన డబ్బు, మద్యం, డ్రగ్స్, ఓటర్లను ప్రభావితం చేసేలా పంచేందుకు సిద్ధం చేసినట్లుగా అనుమానిత వస్తువులను సీజ్ చేశామన్నారు. ప్రచార నిమిత్తం వివిధ రాజకీయ పార్టీలు ఇప్పటివరకు రూ.4,92,12,952 ఖర్చుపెట్టినట్లు గుర్తించామన్నారు.

14,306 మందికి విధులు కేటాయింపు

ఎన్నికల నిర్వహణ కోసం పిఒలు, ఏపిఒలు, ఇతర పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లుగా మొత్తం 14,306 మందికి విధులు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేవారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తున్నామని, సుమారు 32 వేల మందికి పోస్టల్ బ్యాలెట్లు అవసరమవుతాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 2183 పోలింగ్ స్టేషన్లు ఉండగా వీటిలో 486 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పరిశీలించడానికి పోలీస్, జనరల్ అబ్జర్వర్లు కూడా జిల్లాకు వచ్చినట్లు వివరించారు. అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా వివిధ రూపాలలో స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఓటర్లందరికీ బిఎల్ఒల ద్వారా ఓటర్ సమాచార స్లిప్పులను పంపిణీ చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఓటు ఏవిధంగా వేయాలో ఓటర్లకు అవగాహన కల్పించేలా రూపొందించిన కరపత్రాలను, పోస్టర్లను ఈ సందర్భంగా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఆర్ శ్రీలత, స్వీప్ నోడల్ ఆఫీసర్ బి రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా వెంకటసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా దొడ్డ వెంకటసుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఈయన రాజకీయ ప్రవేశం 1982 టిడిపితో మెదలైంది. అప్పటి నుంచి పార్టీకి సేవలు అందిస్తున్నారు. గతంలో పి రాళ్లపల్లి ఎంపిటిసిగా పోటీ గెలుపొందారు. టిడిపి మండల అధ్యకుడిగా, నియోజకవర్గ తెలుగు రైతు సంఘం అధ్యక్షుడిగా కొనసాగారు. రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, టిడిపి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన దొడ్డ వెంకట సుబ్బారెడ్డికి టిడిపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, టిడిపి ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గవదకట్ల హరికష్ణ, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, టిడిపి నాయకులు శ్యామల కాశిరెడ్డి, చిలకల వెంకటేశ్వరరెడ్డి, కొండు విజయ భాస్కర్‌రెడ్డి, కొండు శ్రీనివాసులురెడ్డి, సంపతి రాజగోపాల్ తదితరులు ఉన్నారు.

పీర్లమాన్యంలో తెలుగు మహిళల ప్రచారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనిని 39వ డివిజన్, 95 బూత్ పీర్ల మాన్యంలోని ఎస్టీ కాలనీలో శుక్రవారం రాత్రి సంతనూతలపాడు నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి బిఎన్ విజయ్ కుమార్ విజయం కోసం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలను తెలుగు మహిళలు ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకురాలు ఆరికట్ల సుమతి మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికలలో విజయ్ కుమార్‌ని గెలిపించి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ పథకాలు యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు, నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000, ప్రతి రైతుకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి స్త్రీకి నెలకు రూ.1,500 రూపాయలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు నార్నే మాధవీలత, నాయకులు పొత్తూరి నాగేశ్వరరావు, కొల్లా మహేష్, అమానుల్లా, బొడ్డపాటి రాంబాబు, పురుషోత్తమరావు, మద్దినేని చైతన్య టిఎన్‌టియుసి ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామి చౌదరి, వై మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

11 నామినేషన్లు తొలగింపు: రిటర్నింగ్ అధికారి

ప్రజాశక్తి-దర్శి

దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 22 మంది అభ్యర్థులు 43 సెట్‌లు నామినేషన్ దాఖలు చేయగా అందులో 11 మంది నామినేషన్లు పరిశీలనలో తీసివేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంఈఎస్ లోకేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్లూరి కొండారెడ్డి ఇండియన్ కాంగ్రెస్ పార్టీ, ఇత్తడి శివప్రసాద్ బిఎస్పి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, గొట్టిపాటి లక్ష్మి తెలుగుదేశం పార్టీ, తెనాలి రవిబాబు ఆంధ్ర రాష్ట్ర ప్రజాసమితి, అరెగల శ్రీనివాసులు భారత చైతన్య యువజన పార్టీ, తాటిపల్లి త్రిపురరావు జాతీయ యువజన పార్టీ, కుంచాల కోటేశ్వరరావు అంబేద్కర్ రాడికల్ ఇండియన్ పార్టీ, తేలుకుట్ల కళ్యాణ్‌కుమార్ సమాజ్‌వాది పార్టీ, మీనా మంచ స్వతంత్ర అభ్యర్థి, కమతం జాన్ వెస్లీ స్వతంత్ర అభ్యర్థులుగా పరిశీలనలో ఉన్నట్లు లోకేశ్వరరావు తెలిపారు.

నామినేషన్ల వివరాలను తెలుపుతున్న ఆర్ఓ ఎంఎస్ లోకేశ్వరరావు

వేలం కేంద్రంలో పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి వేలం కేంద్రానికి చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు 891 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 792 బేళ్ల అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 99 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.291, కనిష్ఠ ధర రూ.216, సరాసరి ధర రూ.249.59 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి సునీల్‌కుమార్ తెలిపారు.

పది ఫలితాల్లో గురుకులం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన గుంటి వెంకట్ అనే గిరిజన గురుకులం పాఠశాల విద్యార్థి ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలలో 550/600 మార్కులు సాధించి ఆ పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి పి ఆంజనేయులు విద్యార్థి తల్లిదండ్రులు గుంటి పెద్ద అచ్చయ్య, గుంటి చెన్నమ్మలను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌విఎస్ సురేష్‌బాబు, స్కూల్ ఛైర్మన్ తూమాటి రాంబాబు, ఉపాధ్యాయులు విజయకుమార్, బేతం బాబు, జత్యా నాయక్, తూమాటి చెన్నకేశవులు, గుంటి రామయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న సిబ్బంది

వైసిపికి మాల మహానాడు మద్దతు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న వైసిపికి తమ మద్దతు ఉంటుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిల్లా చెన్నయ్య తెలిపారు. హెూటల్ సరోవర్‌లో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధికారులను హింసించి అవమానించిన విషయం అందరికీ తెలుసన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అండగా నిలిచి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, తనయుడు బాలినేని ప్రణీతరెడ్డి ప్రసంగించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల వెంకట్రావు, జిల్లా సంయుక్త కార్యదర్శి లింగంగుంట కార్తీక్, ఒంగోలు టౌన్ సెక్రటరీ సిహెచ్ గురవయ్య, మాల మహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిల్లా చెన్నయ్య, చిత్రంలో నగర మేయర్ సుజాత

పూజల్లో పాల్గొన్న ఎంఎం కొండయ్య

ప్రత్యేక పూజల్లో అభ్యర్థి ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

కారంచేడు గంగమ్మతల్లి కమిటీ ఆహ్వానం మేరకు గంగాభవాని అమ్మవారి ఆలయాన్ని టిడిపి చీరాల నియోజకవర్గ అభ్యర్థి మద్దులూరి మాలకొండయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు స్వాగతం పలికారు. మే 13న జరుగు ఎన్నికలలో మంచి మెజారిటీతో గెలుపొందాలని, నియోజకవర్గంలో విజయకేతనం ఎగుర వేయాలని అన్నారు. ఈ సందర్భంగా బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను, పర్చూరు శాసనసభ్యులుగా పోటీ చేస్తున్న ఏలూరు సాంబశివరావును అత్యధికమైన మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కరణం వెంకటేష్

వెంకటేష్‌కు పలువురి మద్దతు

ప్రజాశక్తి-చీరాల

నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌కు మద్దతు ఇచ్చి కొత్తపేట పంచాయతీ పరిధిలో గోపాల్ నగర్, ఒడ్డు సంఘం గ్రామాల నుంచి సుమారు 50 కుటుంబాలు మాజీ పార్లమెంట్ సభ్యులు మోదడుగుల వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తన పార్టీ కార్యాలయంలో శుక్రవారం వెంకటేష్‌ను కలిసి వారి సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవి, హనుమంతరావు, సురేష్, శ్రీను, ధర్మా, గోపి, సన్ని, శ్రీకాంత్, మహేంద్ర, రోహన్, సాయి, వెంకట్, రవీంద్ర, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన

ప్రజాశక్తి-కంభం రూరల్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రకాశం జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఐపిఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (క్రైమ్) శ్రీధర్ రావు కంభం, అర్ధవీడు పీఎస్ పరిధిలో గ్రామాలను సందర్శించి ప్రజలకు ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఓటు హక్కు ప్రాధాన్యత గురించి, ఎలక్షన్ సమయంలో ఏమి చేయవచ్చునో చేయకూడదో అనే విషయాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. పోలింగ్ రోజున ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేందుకు జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ప్రతీ ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహనా పెంచుకొని పాటించాలని సూచించారు. ఎన్నికల వేళ ప్రజలు గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండాలని, ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా సహకరించాలని కోరారు. గ్రామాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కంభం సీఐ రామకోటయ్య, కంభం ఎస్ఐ రాజేష్, అర్ధవీడు ఎస్ఐ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
శనివారం 27 ఏప్రిల్ 2024

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

పోలీస్ పరిశీలకులు హసీబ్ ఉర్ రెహమాన్

ప్రజాశక్తి -మద్దిపాడు

సార్వత్రిక ఎన్నికల దష్ట్యా రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను ప్రకాశం జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ పోలీస్ పరిశీలకుడు హసీబ్ ఉర్ రెహమాన్ (ఐపిఎస్) శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి భద్రత ఏర్పాట్లు, సిసి కెమెరాలు, స్ట్రాంగ్ రూమ్స్ వద్ద గార్డ్సను తనిఖీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. స్ట్రాంగ్ రూం భద్రత, నిర్వహణలో తీసుకున్న జాగ్రత్తలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల నిర్వహణ పూర్తయ్యే వరకూ భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. అనంతరం మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రోత్ సెంటర్ వద్ద ఉన్న చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. తనిఖీ విధానాన్ని, రికార్డులను పరిశీలించారు. చెక్‌పోస్ట్‌ల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. చెక్ పోస్టుల వద్ద 24 గంటల సిసి కెమెరాలు పనిచేసేలా చూడాలన్నారు. అక్రమ మద్యం, నగదు, ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులు సరఫరా కాకుండా పటిష్టంగా నిఘా పెట్టాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా, ప్రజలు పోలీసు పరిశీలకులను కలిసి నివత్తి చేసుకోవచ్చని తెలిపారు. శాంతి భద్రతలపై ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దష్టికి తీసుకురావాలలన్నారు. తన ఫోన్ నెంబర్ 9281034495కు సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్‌పి అశోక్ బాబు, సింగరాయకొండ సిఐ రంగనాథ్, జరుగుమల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు, మద్దిపాడు ఎస్ఐ మహేష్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న హసీబ్ ఉర్ రెహమాన్

జాకీ కార్మికుల కూలి రేటు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి-చీమకుర్తి

జాకీ కార్మికుల కూలీ రెట్లు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో లక్ష్మీనారాయణ అధ్యక్షతన సిఐటియు మండల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ జాకీ కార్మికులకు గత ఆరేళ్లుగా రోజూ కూలీ తక్కువగా ఇస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం వారికి రోజు వారీ కూలి రూ. 651 ఇవ్వాల్సి ఉండగా రూ.460 మాత్రమే ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో కార్మికులు రోజుకు రూ.191 నష్టపోతున్నట్లు తెలిపారు. జాకీ కార్మికులకు వేతనాలు పెంచాలని గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్‌కు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. లేబర్ అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్నారు. యాజమాన్యం ఇలాగే వ్యవహరిస్తే కార్మికులు ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికుల పిఎఫ్ బకాయిలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కార్మికులు ఇండియా కూటమి అభ్యర్థులను బలపరచాలన్నారు. బిజెపి దాని మిత్రులను ఓడించాలని తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ మేడే జెండా ఆవిష్కరణ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.ఏడుకొండలు,ఎన్. సురేష్, కనకరాజు, పుల్లయ్య, అభి, జవగలు గౌడ్, బి.ఆంజనేయులు, వివిధ రంగాల నాయకులు పాల్గొన్నారు.

:మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలంసుబ్బారావు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి -కనిగిరి

తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మహిళలు ఖాళీ బిందెలతో శుక్రవారం రాత్రి నిరసన తెలిపారు. కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ సెంటర్‌లో రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత 20 రోజులుగా తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల గురించి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేద వాపోయారు.

నీటి కోసం నిరసన తెలుపుతున్న మహిళలు

మేడేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -కనిగిరి

వచ్చేనెల 1న మేడే కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పిసి.కేశవరావు కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సిఐటియు కనిగిరి మండల కమిటీ సమావేశం సుకన్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు తమ మేనిఫెస్టో లోని హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని తెలిపారు. ఐక్య పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు నరేంద్ర, రజిని, దేవదానం, రమాదేవి, ఎస్‌కె.బషీరా, ప్రసన్న, కాశయ్య, యు.పిచ్చయ్య, రాధ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిసి కేశవరావు

ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ అర్జునరావు

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని కనపర్తి గ్రామంలో ఉపాధి హామీ చట్టం ద్వారా నిర్వహిస్తున్న ఫిష్‌పాండ్ పనులను డ్వామా పీడీ బి.అర్జునరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ధేశించిన కొలతలు ప్రకారం కూలీల చేత పనిచేయించి వారికి రోజు వారీ రూ.300 వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రోజు వారీ కూలి రూ.300 కంటే తక్కువ వస్తే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ కిట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉదయం ఆరు గంటలకే కూలీలు పనిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మస్టర్ నమోదులో అవకతవకలు జరిగితే అందుకు బాధ్యులను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.. అనంతరం ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు లేబర్ టార్గెట్, వేతనం. తదితర అంశాలపై చర్చించారు ఈకార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్. పి. వెంకటస్వామి , ఎంపిడిఒ వై.మహాలక్ష్మి , ఎపిఒ రవిబాబు, ఇసి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన శ్రీనివాసులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన స్థానిక త్రిపురాంతకం రోడ్డులోని రవీంద్ర మల్టీ స్పెషాలిటీ వైద్యశాల సమీపంలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసు కథనం ప్రకారం.... యర్రగొండపాలెంకు చెందిన వెలగల శ్రీనివాసులు(34) ముఖంపై రక్తపు గాయాలతో మరణించి ఉన్నాడు. శ్రీనివాసులుది హత్యా లేక ఆత్మహత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తహశీల్దారు కార్యాలయం వద్ద టీ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య సఖ్యత లేదని ప్రజలు చర్చించుంటున్నారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు నామినేషన్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజక వర్గంలో నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ఎన్నికట రిటర్నింగ్ అధికారి కుమార్ తెలిపారు. మొత్తం 25 మంది అభ్యర్థులు 47 సెట్ల నామినేషన్లు దాఖలు దాఖలు చేసినట్లు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన నామినేషన్ల పత్రాల పరిశీలన అనంతరం నాలుగు నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరుపున నామినేషన్ దాఖలు చేసిన శ్రీపతి సతీష్, పసుమర్తి మరియమ్మ, టిడిపి తరపున నామినేషన్ దాఖలు చేసిన డోలా రాజేశ్వరి, వైసిపి తరపున నామినేషన్ దాఖలు చేసిన ఆదిమూలపు విశాల్ సరైన పత్రాలు నామినేషన్‌తో పాటు దాఖలు చేయనందున వారి నామినేషన్లు తిరస్కరించినట్లు ఆర్ఓ తెలిపారు. మిగిలిన 21 మంది అభ్యర్థులు దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.



ప్రచారం నిర్వహిస్తున్న షీస్టి

తండ్రి కోసం కుమార్తె ప్రచారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి కొండపి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె షీస్టి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామ పంచాయతీలో షస్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన తండ్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గెలుపు ద్వారా మూలగుంటపాడు అభివద్ధి చెందుతుందని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించింది. తన తండ్రిని గెలిపించాలని కోరారు. తన తంరడిని ఆదర్శిస్తే కొండపి నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారని తెలిపింది. ఈ కార్యక్రమంలో వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచులు చుక్కా కిరణ్‌కుమార్, పాదర్తి మాధవరావు, రాయి పేర్రాజు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, చొప్పర వెంకన్న, మూలగుంటపాడు గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమరం

ఓటర్లను అభ్యర్థిస్తున్న ఆనందబాబు

ఆనందబాబు విస్తృత పర్యటన

ప్రజాశక్తి - వేమూరు

టిడిపి అభ్యర్థి నక్కా ఆనందబాబు నియోజకవర్గంలో విస్తృతంగా శుక్రవారం పర్యటించారు. ఓటర్లను కలిసి మాట్లాడారు. టిడిపి పథకాలను వివరించారు. ఆనంద బాబు తనయుడు అఖిలేష్ వివిధ మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర అభివృద్ధి, పిల్లల భవిష్యత్తు కోసం చంద్ర బాబును గెలిపించాలని కోరారు. వైసిపి పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి 20ఏళ్లు వెనక్కి వెళ్ళిందన్నారు. అభివృద్ధిని తిరిగి పొంది పాలన గాడిలో పెట్టేందుకు టిడిపిని గెలిపించాలని కోరారు. టిడిపి, జనసేన సంయుక్తంగా ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు.

ఎన్నికలపై గృహ సారధులకు దిశా నిర్దేశం చేస్తున్న దృశ్యం

ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే..

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం వలివారు గ్రామంలో వైసీపీ గృహ సారధులు, నాయకులు, మాజీ వాలంటీర్లు, బూత్ కమిటీ సభ్యులకు ఎన్నికల నిర్వహణపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండల ఎన్నికల పరిశీలకులు దాది సుబ్బారావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమైనదని అన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించి ఓటు వేయించేందుకు కృషి చేయాలని అన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలని కోరారు. పోలింగ్ రోజు చేపట్టాల్సిన చర్యలపై మాజీ జెడ్పిటిసి గాదె శివరామకృష్ణారెడ్డి వివరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి దాట్ల సౌజన్య, సర్పంచ్ పందిపాటి ఏసు, ఎంపిటీసీ ప్రవీణ్, అన్నపరెడ్డి వీరారెడ్డి పాల్గొన్నారు.

వైసిపి కండువా కప్పుతున్న అశోక్ బాబు

అశోక్‌బాబు సమక్షంలో వైసీపీలో చేరిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలం పల్లెకోన, చుండూరు మండలం చినగాదెలవర్రు గ్రామాల నుండి టిడిపికి చెందిన నాయకులు వైసీపీలో శుక్రవారం చేరారు. వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబు వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దామని సూచించారు. ఈపాటికే నియోజకవర్గంలో ప్రజలంతా వైసిపినీ గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్ళుగా పనిచేస్తున్న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పల్లెకోన గ్రామ సర్పంచి బొల్లెద్దు రాజమ్మ ప్రదీప్, న్యాయవాది సేరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పరిశ్రమలు సర్వనాశనం

ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి

నియోజకవర్గంలో చిరు వ్యాపారులకు, దినసరి కూలీలకు టిడిపి అండగా ఉంటుందని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి కౌన్సిలర్లు, పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వార్డులో పర్యటించారు. బాలికల ఉన్నత పాఠశాల వద్ద చిరు వ్యాపారులతో మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్ సంక్షేమం పేరుతో కుడి చేత్తో రూ.10 ఇచ్చి ఎడమచేత్తో రూ.100 లాగేస్తున్నారని అన్నారు. వీధివ్యాపారులకు వడ్డీలేని రుణాల పేరుతో రూ.10వేలు ఇస్తున్నారని, ఇదే సమయం లో ఆశీలు పేరుతో ఏటా రూ.10,800 లాగేస్తున్నారని తెలిపారు. చిరువ్యాపారులు రోజువారీ జీవనం సాగిస్తున్న ప్రాంతంలోనే అనుమతులు ఇచ్చి పోలీసు వేధింపులు లేకుండా చేస్తానని అన్నారు. గతంలో చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టిన దాఖలాలు లేవని చెప్పారు. వైసిపి అధికారానికి వచ్చినప్పటి నుండి పట్టణంతోపాటు బల్లికురవ, మేదరమెట్ల లాంటి గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా చిరు వ్యాపార దుకాణాలను ఇష్టారీతిన ఖాళీ చేయించి పొట్ట కొట్టారని ధ్వజమెత్తారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ నుండి గత ఐదేళ్లలో ఒక్క రూపాయి లబ్ధి చేకూరలేదని అన్నారు. పేరుకే కార్పొరేషన్ ఉందన్నారు. కేంద్రం తెచ్చిన ఈబీసీ చట్టంలో ఆర్యవైశ్యులకు 5శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పేద ఆర్య వైశ్యులకు టీడీపీ పాలనలో కేటాయించిన టిడ్కో ఇళ్లు, రేషన్ కార్డులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. ఆర్యవైశ్య విద్యార్థులకు విదేశీవిద్య అందించడానికి కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించేలా టిడిపి చర్యలు తీసుకుం టుందని అన్నారు. జగన్ అండో కో జె-ట్యాక్స్ విధానాల కారణంగా ఆర్యవైశ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రకరకాల పన్నులతో వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్నారు. వైసిపి ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించిన వ్యాపార ప్రముఖులపై దాడులు, హత్యలకు పాల్పడ్డారని అన్నారు. ఒంగోలులో సుబ్బారావు గుప్తాపై గంజాయి కేసు బనాయించి జైలులో పెట్టి సైకో ఆనందం పొందారని ఆరోపించారు. నంద్యాల మండీ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు తిరువీధి వెంకట సుబ్బయ్య కిరాతకంగా చంపిన రౌడీలు వైసీపీ నేతల అండతో దర్జాగా రోడ్లపై తిరుగుతున్నారని అన్నారు. ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే అవకాశం టిడిపి ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. అనవసరమైన పన్నుల భారాన్ని తగ్గించి వ్యాపారులను ప్రోత్సహిస్తామని అన్నారు. ఆర్యవైశ్యుల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయి స్తామని చెప్పారు. చిరు వ్యాపారులకు సబ్సిడీ రుణాలు అందజేస్తామని చెప్పారు. పేద ఆర్యవైశ్య విద్యార్థులకు విదేశీవిద్య పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

అభివృద్ధి జరగాలంటే రఘుపతి రావాలి

ప్రజాశక్తి బాపట్ల

అభివృద్ధి కుంటు పడకుండా ముందుకు సాగేందుకు కోనా రఘు పతిని తిరిగి ఎంఎల్‌ఎగా గెలిపించు కోవాలని ప్రముఖ వ్యాపార వేత్త గుండ్రెడ్డి శివ పేర్కొన్నారు. వైసిపి ఎన్నికల ప్రచారంలో భాగంగా సినీ రచయిత కోన వెంకట్‌తో కలిసి పట్టణంలోని కాకుమాను వారిపాలెం, సంజ య్ గాంధీ కాలని ప్రాంతాల్లో వైసిపి అభ్యర్థి కోనా రఘుపతి తరుపున శుక్రవారం ప్రచారం నిర్వహించారు. బాపట్లలో జరిగిన అభివృద్ధి, జరగబోయే అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని వైసిపిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రఘుపతికి మూ డో సారి విజయాన్ని కట్ట బెట్టాలని కోరారు. గతంలో కోనకు పట్టణంలో ఆశించిన స్థాయిలో మెజార్టీ రాకపోయినా ఈసారి ఎన్నికల్లో పట్టణంలోని అన్ని వార్డుల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. 34వార్డుల్లో వైసిపి అభ్యర్థికి మద్దతు కోరుతూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, ప్రచార కార్యదర్శి చింతల రాజశేఖర్, రంగారావు, పద్మ, నర్రా వెంకట్రావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సయ్యద్ పీర్, జోగి రాజా, గోపి, శ్రీనివాస్, మనోహర్ పాల్గొన్నారు.

పట్టణంలో వైసిపి నాయకుల ప్రచారం

వైసీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

కరపత్రాలు పంచుతున్న వనజాక్షి చెన్నారెడ్డి

ప్రజాశక్తి - మార్కాపురం

ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ గెలిపించాలని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి కోరారు. పట్టణంలోని 36వ వార్డులో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంఎల్‌ఎగా అన్న రాంబాబు, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి లను గెలిపించాలని కోరారు. వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పేర్కొన్నారు. పట్టణానికి డాక్టర్ వైఎస్ఆర్ హయాంలోనే తాగునీరు అందించారని పేర్కొన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలకు రూ.475కోట్లతో పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని 25వ వార్డు కౌన్సిలర్ చాటకొండ చంద్ర ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో రామడుగు రమేష్, పెసల జనార్ధన్, బిసా వాసు, కాళ్ళ ఆది, పానుగంటి మురళి, తాడువాయి నరసింహ పాల్గొన్నారు.

ముత్తారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో

పట్టణంలోనిలోని 33వ వార్డు ఇంచార్జ్ ముత్తారెడ్డి వెంకటరెడ్డి, జమ్ములదిన్నె నాగిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ఎన్నికల ప్రచారం రాత్రి నిర్వహించారు. ఎంఎల్‌ఎగా అన్న రాంబాబు, ఎంపీ టి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని భాస్కరరెడ్డి గెలిపించాలని కోరారు.

ఎన్నికల ప్రచారంలో ముత్తారెడ్డి వెంకటరెడ్డి

ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని అడుసుమల్లి మాజీ ఎంపిటీసీ, గ్రామ ఉపసర్పంచి అడ్డగడ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు సమక్షంలో టిడిపిలో శుక్రవారం చేరారు. వెంకటేశ్వర్లుకు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు 50 కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. పంగులూరు శ్రీనివాసరావు, గొల్లపూడి సుబ్బా రావు, నర్రా దశరధరామయ్య, కట్ట మాణిక్యరావు, కొంగర శ్రీరామ్మూర్తి, ముప్వ కృష్ణారావు, జి సాంబశివ రావు, బి బుల్లయ్య చౌదరి, పి శ్రీనివాసరావు, ఆర్ నాగేశ్వరరావు ఉన్నారు.

టిడిపిలో చేరిన వాళ్లతో ఎంఎల్ఎ ఏలూరి

రాజుపాలెంలో వైసీపీ ప్రచారం

ప్రజాశక్తి - పొదిలి

నగర పంచాయతీ రాజుపాలెం గ్రామంలో మార్కాపురం వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి అన్నా రాంబాబు కోడలు, అన్నా కృష్ణ చైతన్య సతీమణి అన్నా అనూష శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. మే 13న జరుగు ఎన్నికల్లో ఒంగోలు ఎంపీగా వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మార్కాపురం ఎంఎల్‌ఎగా వైసిపి అభ్యర్థి అన్నా వెంకట రాంబాబును గెలిపించాలని కోరారు. రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ డైరెక్టర్ జూపల్లి ఏడుకొండలు, మాజీ జెడ్పిటిసి సాయి రాజేశ్వరరావు, వైసిపి వాణిజ్యభాగం జిల్లా నాయకులు యక్కలి శేషగిరిరావు, వైసిపి పట్టణ అధ్యక్షురాలు ఎస్‌కె నూర్జహాన్ బేగం, దోర్నాల వరలక్ష్మమ్మ, మెట్టు రమణమ్మ, వరికూటి శిరీష, సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో అన్నా అనూష

30న సినీ నటులు బాలయ్య రాక

ప్రజాశక్తి - మర్రిపూడి

సినీ నటులు, హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 30న మర్రిపూడి వస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు చేరెడ్డి నర్సారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మర్రిపూడి బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

బాలకృష్ణ

సార్వత్రిక సమరం

ప్రజా సంక్షేమమే ధ్యేయం

వైసిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-దర్శి

ప్రజాసంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైసిపి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తెలిపారు. దర్శి మండల పరిధిలోని నడింపల్లి, వెంకటాచలంపల్లి, చలివేంద్రం గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపితోనే గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమని తెలిపారు. ప్రతి పల్లె, ప్రతి గ్రామం అభివద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించు కోవాలన్నారు. అన్ని వర్గాలకు, అన్ని కులాలకు, మతాలకు సమన్యాయం జరగాంటే వైసిపి అధికారంలోకి రావాలన్నారు. వైసిపితోనే రైతులకు, కార్మికులకు, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. తమ కుటుంబం గత 20 సంవత్సరాలుగా దర్శి నియోజకవర్గానికి సేవలం దిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగా తనను, వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకామయ్మ మాట్లాడుతూ జగన్‌మోహన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత సచివాలయ వ్యవస్థ, వాలంటీరు వ్యవస్థను ప్రవేశ పెట్టి ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో దర్శి ఎమ్మెల్యేగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని, వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, గ్రామ సర్పంచి అంకాల శ్రావణి, శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు పాణ్యం కష్ణారెడ్డి, కొండలు, వైసిపి మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, గొల్లపాటి మోసే, వైసిపి ఇన్‌ఛార్జి మస్తాన్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

పార్టీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యత

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి - వెలిగండ్ల

పార్టీ కోసం కష్టపడేవారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని, అందుకు 42 ఏళ్లగా పార్టీని నమ్ముకొని ఉన్న దొడ్డ వెంకట సుబ్బారెడ్డి ఉదాహరణ అని టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి తెలిపారు. దొడ్డ వెంకట సుబ్బారెడ్డి టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులు అయిన సందర్భంగా కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, టిడిపి కనిగిరి నియోజక అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి స్థాపించినప్పటి నుంచి పార్టీ కోసం వెంకటసుబ్బారెడ్డి పనిచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, గోనా ప్రతాప్, షేక్ షరీఫ్, బేరి పుల్లారెడ్డి, గోనా వెంకటయ్య పాల్గొన్నారు.

వెంకట సుబ్బారెడ్డి ని సన్మానిస్తున్న ఎంపీ మాగుంట

ఆదర్శిస్తే అభివృద్ధి చేస్తా : సురేష్

ప్రజాశక్తి -శింగరాయకొండ

తనను ఆదరిస్తే నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తామని వైసిపి కొండపి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. జరుగుమల్లి మండల పరిధిలోని వావిలేటిపాడు, జరుగుమల్లి, చింతల పాలెం గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇస్తే కొండపి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివద్ధి చేసి ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బత్తిన మదన మనోహర్, పిన్నికి, శ్రీనివాసరావు , పల్లా అనురాధ, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో మంత్రి సురేష్

పాడి పరిశ్రమను ఆదుకుంటాం

టిడిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

టిడిపి అధికారంలోకి వస్తే పాడి పరిశ్రమను ఆదు కుంటామని టిడిపి కూటమి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని చెరువు కొమ్ముపాలెం, పోతకమూరు, తూర్పు వీరాయపాలెం, బొట్లపాలెం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ వైసిపి పాలనలో అమూల్య డెయిరీలు పెట్టి పాడి పరిశ్రమను దెబ్బతీసినట్లు విమర్శిం చారు. చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయితే పాడి పరిశ్రమకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధరల స్థిరీకరణ పథకాన్ని ప్రవేశ పెడతామన్నారు. గ్రామాలలో మౌలిక వసతులు కల్పన, తాగునీరు, సాగునీరు, డ్రైనేజీలు, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులు రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు టిడిపిలో చేశారు. డాక్టర్ లలిత సాగర్, మాగుంట రాఘవరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండడల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, శోభారాణి, నాయకులు కోటేశ్వరరావు, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, చంద్రం నరసయ్య, పరిటాల సురేష్, మార్తల కోటిరెడ్డి, పుచ్చ అచ్చిరెడ్డి, పుల్లారెడ్డి, కోటేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

తెలుగుదేశం తోనే గ్రామాలు అభివద్ధి చెందుతాయని టిడిపి కొండపి నియోజక వర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. జరుగుమల్లి మండల పరిధిలోని నందనవనం బిట్రగుంట వావిలేటిపాడు, జరుగు మల్లి, పొంగులూరు వారిపాలెం, దావగుండూరు, చింతలపాలెం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్వామి మాట్లాడుతూ గతంలో టిడిపి హయాంలో దామచర్ల ఆంజనేయులు, ఆ తర్వాత తన హయాంలో గ్రామాలను అభివద్ధి చేసినట్లు తెలిపారు. వైసిపి ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో ఏమి అభివద్ధి పనులు చేశారో చెప్పాలన్నారు. గ్రామాల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని, కొండపి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోకూరి రవీంద్రబాబు , పోటు పెద్దబాబు, బెల్లం సత్యనారాయణ, విజయనిర్మల, పాతూరి కోటేశ్వరరావు, శివాజీ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వా మి

వైసిపిలో చేరిన వారితో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం శివరామపురం ఎస్‌సి కాలనీకి చెందిన అనపర్తి బ్రహయ్య, అనుపర్తి మోషే, యారజని యేసుబాబు, తెళ్ళ ఏలేసు, ముప్పావరపు పెరయ్య, అనుపర్తి అదయ్య, యారజని చిన్నదేవదాసు వైసిపిలో చేశారు. తాళ్లూరులో మేడగం చంద్రశేఖర్‌రెడ్డి సారధ్యంలో సంగు నాగార్జునరెడ్డి, యరం రాజశేఖర్‌రెడ్డి, కాటం వెంకటరెడ్డి, చెరుకుపల్లి నరసింహ వైసిపిలో చేరారు. రాజానగరం గ్రామంలో మాజీ ఎంపిటీసీ మారం వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు మారం నాగిరెడ్డి, మారం నాగార్జునరెడ్డి టిడిపిలో చేరారు. వారికి వైసిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

టిడిపిలో చేరిక

పొన్నలూరు : మండల పరిధిలోని భోగనంపాడులో టిడిపి కొండపి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పది కుటుంబాల వారు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే స్వామి వారికి కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మేలుకలుగుతుంన్నారు. టిడిపిలో చేరిన వారిలో ముతంగి మల్లికార్జున, మాల్యాద్రి, నరేంద్ర, పద్మ, నాని, మధు, మాలకొండయ్య, వంగపాటి భానుచంద్ర, ముండ్లమూరి పిచ్చయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, కొండ్రగుంట శ్రీనివాసరావు, నాయకులు కర్ణ కోటిరెడ్డి, పిల్లి వెంకటనారాయణ రెడ్డి, గుమ్మళ్ల వెంకటరావు, జనసేన నాయకులు కనపర్తి మనోజ్ కుమార్, బిజెపి నియోజకవర్గ అధ్యక్షులు బాలకోటయ్య, తెలుగు యువత అధ్యక్షుడు బోయపాటి రమణారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా, బీసీ సెల్ అధ్యక్షుడు మల్యాద్రి, మహిళా అధ్యక్షురాలు తన్నీరు మౌనిక, రైతు సంఘం అధ్యక్షులు కుంకు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి రోడ్ షో

పిసిపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం రోడ్ షో నిర్వహించారు. టిడిపి కూటమి కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. మండల పరిధిలోని పెదఅలవలపాడు, పిసిపల్లి మీదుగా పెదఇర్లపాడు వరకూ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపించాలన్నారు. తననను ఆదరిస్తే కనిగిరి నియోజక అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, సీనియర్ నాయకులు గడ్డం బాలసుబ్బయ్య, కడప ఓబుల్‌రెడ్డి, వీరపునేని పెద్దన్న, మూలె సత్యంరెడ్డి, కశిరెడ్డి హనుమారెడ్డి పాల్గొన్నారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నరాయునిపల్లికి చెందిన 15 కుటుంబాలు, గంజివారిపల్లి పంచాయతీ పరిధిలోని గాంధీనగర్, శాంతినగర్, బాయిపెంట గ్రామాలకు చెందిన 25 కుటుంబాలు మొత్తం 40 కుటుంబాలు శుక్రవారం యర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ యర్రగొండపాలెం నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు వారికి పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వారినుద్దేశించి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో బటన్ నొక్కుడుతో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఐదేళ్లు నియోజకవర్గానికి మంత్రిగా పని చేసిన ఆదిమూలపు సురేష్ ద్వారా ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. నియోజకవర్గం అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ టిడిపిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు బోడా చెన్న వీరయ్య నాయుడు, మంత్రూనాయక్, చెవుల అంజయ్య, పాలడుగు కోటయ్య, కిశోర్, షేక్ మస్తాన్‌వలి, దొంతా వెంకట్రావు గౌడ్, కె భాస్కర్‌తో పాటు గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

పార్టీలో చేరినవారితో టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు

27 నుంచి ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: మండలంలో ఈ నెల 27, 29, 30 తేదీలలో హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ పియూ ప్రాజెక్టు యర్రగొండపాలెం వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ ముత్తూట్ ఎం జార్జి ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ ఏరియా సమన్వయకర్త పూర్ణకంటి తిరుమలయ్య శుక్రవారం తెలిపారు. ఈ వైద్యశిబిరంలో బిపి, షుగర్, హార్ట్, లివర్, కిడ్నీ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేసి చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీన గోళ్లవిడిపిలో, 29న యర్రగొండపాలెం లోని ఇందిర నగర్ ఉదయ్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో, 30న వై కొత్తపల్లి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలకు వచ్చి పరీక్షలు చేయించుకునే వారు పరగడుపున ఏమీ తినకుండా రావాలని తెలిపారు. వివరాలకు సెల్ 6301452014 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నామినేషన్ల పరిశీలన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

శ్రీలేఖ, నియోజకవర్గ ఎన్నికల అధికారి

యర్రగొండపాలెం ఎస్సీ నియోజకవర్గంలో నామినేషన్ల పరిశీలన అనంతరం 18 మంది అభ్యర్థులు ఉన్నట్లు యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ పి శ్రీలేఖ శుక్రవారం తెలిపారు. బరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బూదాల అజితారావు, టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, వైసిపి అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి కోట పిచ్చయ్య, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పేళ్ల హెప్సి రాణి, సమాజ్ వాది పార్టీ అభ్యర్థి వేశపోగు ఏలియా, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి దూపాటి చంద్రబాబు, భారతీయ యువజన చైతన్య పార్టీ అభ్యర్థి ముటుకూరి కృపయ్య, జై భీమ్ రావ్ భారత్ పార్టీ అభ్యర్థి దర్శి వెంకటేశ్వర్లు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి కొర్రపోలు జయరాజు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేదూరి వెంకటేష్, స్వతంత్ర అభ్యర్థులుగా గొట్టెముక్కల సుజాత, తురక రత్నపాల్, కొమ్ముల రవి, ముంగమూరి శ్రీనివాసులు, తాటిపర్తి సుధాకర్ పోటీలో ఉన్నట్లు ఆమె తెలిపారు.

సుధాకర్‌ను సన్మానిస్తున్న వైసిపి కార్యకర్తలు

వైసిపిని గెలిపించండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే వైసిపిని గెలిపించాలని వైసిపి యర్రగొండపాలెం ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ సోదరుడు తాటిపర్తి సుధాకర్, ఆయన భార్య, సింగరాయకొండ సర్పంచ్ తాటిపర్తి వనజ కోరారు. శుక్రవారం వైసిపి నాయకులతో కలిసి వారు యర్రగొండపాలెం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటిపర్తి సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తన తమ్ముడు తాటిపర్తి చంద్రశేఖర్ యర్రగొండపాలెం నుంచి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాటిపర్తి చంద్రశేఖర్, ఎంపి అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, జడ్పి కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, వైసిపి నాయకులు జబివుల్లా, కొర్రపోలు సుందర్, ఖాసిం, అడిపి సుందర్, గురిజేపల్లి వలి, కందూరి కాశి, కాకుమాను హనుమంతరావు, కెవి నారాయణ, జక్కా సుబ్బారావు, కందూరి గురు, తూమాటి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లు పరిశీలిస్తున్న ఆర్‌డిఓ నాగజ్యోతి

24 నామినేషన్లు ఆమోదం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్‌డి ఓ నాగజ్యోతి శుక్రవారం నామినేషన్ల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమానికి నామినేషన్ దాఖలు చేసిన అన్ని పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు. అభ్యర్థుల సమక్షంలో ఆర్‌డిఓ ప్రతి నామినేషన్‌ను పరిశీలించి ఈసిఐ నిబంధనల ప్రకారం 24 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించారు. నలుగురు అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు.

నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

విద్యార్థులకు వీడ్కోలు సభలో వనమా రామకృష్ణారావు

ప్రజాశక్తి-వేటపాలెం

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాల బి టెక్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగ విద్యార్థులు వీడ్కోలు సభ నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి జగదీష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని తగిన సమయంలో పూర్తి చేసినట్లేతే త్వరితగతిన పురోభివృద్ధి చెందవచ్చునని తెలిపారు. బలమైన ఆకాంక్ష, దృఢమైన కృషితో జీవితంలో ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందవచ్చునని తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎస్‌విడి అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సరియైన ప్రణాళికతతో కృషి చేసినట్లయితే ఉన్నత స్థాయిలో విజయాన్ని సాధించవచ్చునని తెలిపారు. విద్యార్థులు డిజైనింగ్, ఆధునిక సాఫ్ట్‌వేర్లపై పట్టు సాధించినట్లయితే ఉన్నత ఉద్యోగ అవకాశాలను త్వరితగతిన పొందవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం మూడో సంవత్సరం విద్యార్థులు ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ సందేశాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

పార్టీలో చేరినవారితో టిడిపి అభ్యర్థి బిఎన్ విజయకుమార్

టీడీపీలో పలువురి చేరిక

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎన్ విజయ్ కుమార్ నివాసం ఒంగోలులో శుక్రవారం మద్దిపాడు మండలం నందిపాడు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మండవ ప్రతాప్, పోతుల శ్రీరామమూర్తి, కాకి నాగేశ్వరావు, రంపతోటి వెంకటేష్, మేడికొండ ఏడుకొండలు, మేడికొండ సింగయ్య, కాకి చంటి, కొల్లా సుధీర్, కాకి విష్ణు, మండవ రవణమ్మ వైసిపి నుంచి టీడీపీలో చేరారు. వారికి టిడిపి కండువాలు కప్పి విజయ్ కుమార్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు మండల పార్టీ అధ్యక్షులు మండవ జయంత్ బాబు, నాయకులు మండవ వెంకటస్వామి, కొర్రపాటి మాధవరావు, మన్నే శేషయ్య, కోడూరి లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో వ్యాపార రంగం కుదేలు

ఇంటింటి ప్రచారంలో అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు

ప్రచారంలో అశోక్‌రెడ్డి

రాష్ట్రంలో వైసిపి పాలనలో వ్యాపార రంగాలు కుదేలయ్యాయని గిద్దలూరు టిడిపి కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి అమ్మవారిశాల, పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించి వ్యాపార సముదాయాల యజమానులను కలుసుకొని టీడీపీ, జనసేన, బీజేపీ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. నాడు తెలుగు దేశం హయాంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేసినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వైసిపి అన్ని వర్గాలనూ నట్టేట ముంచిందని, వ్యాపార రంగాలపై దాడులు చేయించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. ప్రజలంతా వైసిపి చేస్తున్న అరాచకాలను గమనిస్తున్నారని అన్నారు. తాను స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని అన్నారు. నియోజకవర్గ ప్రజలు తనకు మద్దతుగా నిలిచి మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో తనకు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసులరెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.289

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం చీమకుర్తి మండలం కేవి పాలెం గ్రామ రైతులు 1,085 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 889 బేళ్లు కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 196 బేళ్లను తిరస్కరించారు. అత్యధిక ధర కిలో రూ.289 పలుకగా అత్యల్ప ధర రూ.220 పలికింది. సరాసరి కిలో ధర రూ.255.85 పలికింది. వేలంలో 22 కంపెనీలు పాల్గొన్నాయి. వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ వేలాన్ని నిర్వహించారు.

ఇంటింటి ప్రచారంలో కుందూరు నాగార్జునరెడ్డి

పేదల పక్షపాతి జగన్ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని 7,8 వార్డులలో ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకున్న ఆయన పేద ప్రజల అభివృద్ధి కోసం నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఒక్క సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతున్నదని అన్నారు. ఈ ప్రచారంలో కౌన్సిలర్లు బాలిరెడ్డి, పెద్ద బాషా, కో-ఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో అందజేస్తున్న అభ్యర్థి సుబ్బారావు

కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కాంగ్రెస్ అభ్యర్థి బూరగ సుబ్బారావు తన ప్రచారం విస్తృతం చేశారు. టిడిపి, వైసిపి అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేయగా అందుకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థి సుబ్బారావు వామపక్షాలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని పల్లెకోన గ్రామంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో కరపత్రాలు ప్రజలకు అందజేశారు. రాష్ట్రంలోనే కాక దేశంలో కూడా బిజెపి పాలన అన్ని వర్గాల ప్రజలను కలిచి వేస్తుందని అన్నారు. బిజెపి మద్దతుతో ఎన్నికల బరిలో దిగిన ప్రాంతీయ పార్టీలను ఓడించి రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా హస్తం గుర్తుపై ఓటు వేసి ఎంఎల్ఎగా తనను, ఎంపిగా జెడి శీలంను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు తాడికొండ వెంకటేశ్వరరావు, నిజాంపట్నం ఏడుకొండలు, గౌస్ బెగ్, సిపిఎం నాయకులు ఎం సత్యనారాయణ, సిపిఐ నాయకులు జి బాలాజీ పాల్గొన్నారు.

టిడిపి అధ్యక్షునిగా సలగల

ప్రజాశక్తి - బాపట్ల

సలగల రాజశేఖర బాబు

టిడిపి బాపట్ల లోకసభ నియోజకవర్గ అధ్యక్షునిగా టిడిపి సీనియర్ నాయకులు సలగల రాజశేఖర బాబు నియమితులయ్యారు. టిడిపి జాతీయ, రాష్ట్ర కమిటీల నియామకాల్లో భాగంగా నూతన బాధ్యులను టిడిపి అధిష్టానం శుక్రవారం ప్రకటించింది. ఎంతోకాలంగా టిడిపికి వెన్నంటి ఉండి పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తూ ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిశీలకునిగా క్రియాశీలక బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా జిల్లా అధ్యక్ష బాధ్యతలు రాజశేఖర్‌బాబుకు అప్పగించినట్లు కార్యకర్తలు పేర్కొన్నారు. రాజశేఖర్ బాబు నియామకం పట్ల టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ, మాజీ ఎంపీపీ మానం విజేత, టిడిపి సీనియర్ నాయకులు తోట నారాయణ, దయా బాబు, పిట్టలవానిపాలెం మండలం నాయకులు గొర్రె ముచ్చ ఆనందరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, కర్లపాలెం, బాపట్ల, పీవీ పాలెం మండల అధ్యక్షులు ఏపూరి భూపతిరావు, ముక్కామల శివ, కనుమూరి సాంబమూర్తి రాజు అభినందించారు.

మాట్లాడుతున్న నందిగం సురేష్

వైసిపి విజయానికి కృషి చేయండి

ప్రజాశక్తి - బాపట్ల

రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ కార్యకర్తలను కోరారు. పట్టణంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఎంఎల్ఎ అభ్యర్థి కోన రఘుపతితో కలిసి మాట్లాడారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. బాపట్ల ప్రాంతం మరింత అభివృద్ధికి పార్లమెంటు స్థాయిలో ఏడు అసెంబ్లీల సమగ్ర అభివృద్ధికి తిరిగి జగన్ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ చిన్నిపోతుల హరిబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, కోకి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం చేస్తే ప్రాణదాతలుగా నిలుస్తారు

ప్రజాశక్తి - బాపట్ల

శిబిరంలో ఎడ్యుకేషన్ సొసైటీ పాలకవర్గం

రక్తదానం చేస్తే ప్రాణదాతలుగా నిలుస్తారని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. రేపల్లె రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల్లో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి మానవతా విలువలతో ఎదుటివారికి సహాయం చేయగలిగే వ్యక్తిత్వాన్ని కలిగి ఉండాలని తెలిపారు. 60 మంది విద్యార్థులు, అధ్యాపకుల తోపాటు ఎన్‌సిసి క్యాడేట్స్ రక్తదానం చేశారు. సొసైటీ ఉపాధ్యక్షులు దోప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్ కుమార్, కరస్పాండెంట్ కొమ్మి నేని హరిపద్మ ప్రసాద్, తాళ్లూరి రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఐ హరిత, ఎన్‌సిసి అధికారిణి ఓ శ్రీదేవి, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి బిఎస్ నారాయణభట్టు, రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె కార్యదర్శి టి ప్రసాదరెడ్డి, వి వీర రాఘవయ్య పాల్గొన్నారు.

మోటారుసైకిల్ మైలేజ్ చెకప్ పోటీలు

ప్రజాశక్తి - మార్కాపురం

మైలేజి చెకప్ పోటీ ప్రారంభిస్తున్న రమణారెడ్డి

మోటార్ సైకిల్లో హీరోకు మరొకటి సాటి లేదని పట్టణంలోని సాయి కిరణ్ మోటార్స్ అధినేత జివి రమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక హీరో కంపెనీకి చెందిన హెచ్ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్ మైలేజ్ చెకప్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. పోటీలను రమణారెడ్డి ప్రారంభించారు. వాహనాలను క్రమం తప్పకుండా మెయింటెనెన్స్ చేయించుకోవాలని అన్నారు. అలా చేసుకోవడంతో మైలేజ్ పెరిగే అవకాశం ఉందన్నారు. మైలేజ్ పోటీల్లో షేక్ ఖాదర్ వలీ వాహనం 84కిలో మీటర్లు, డి పెద్ద నాసరయ్యకు చెందిన వాహనం 84 కిలో మీటర్లు, సిహెచ్ కృష్ణకు చెందిన వాహనం 70కిలోమీటర్ల మైలేజీతో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. అనంతరం బహుమతులు ప్రధానం చేశారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల అసెంబ్లీకి దాఖలైన నామినేషన్లలో ఐదు తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి చామకూరి శ్రీధర్ తెలిపారు. నామినేషన్ల పరిశీలనలో కోన రమాదేవి, వేగేశన హరికుమారి, గంట నవీన్ నామినేషన్లతోపాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్ల అఫిడవిట్‌లో తప్పులు గుర్తించి తిరస్కరించినట్లు తెలిపారు.

మార్కాపురం : స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్లను పరిశీలనలో వైసీపీ అభ్యర్థి అన్న రాంబాబుతో పాటు ఎపిఐఐసి చైర్మన్ జంకే వెంకటరెడ్డి, టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి సయ్యద్ జావ్వర్, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు. పార్టీల నామినేషన్లన్నీ ఆమోదించినట్లు ఆర్ఓ రాహుల్ మీనా తెలిపారు. 29మంది పోటీలో ఉన్నట్లు తెలిపారు.

అద్దంకి : స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునీల్ నామినేషన్లను శుక్రవారం పరిశీలించారు. పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరుగురి నామినేషన్లు తిరస్కరించినట్లు తెలిపారు. సరైన పత్రాల పూరింపు లోపం, ఇతర కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. మొత్తం 15 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నాయని తెలిపారు.

పర్చూరు : ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్ఓ గంధం రవీందర్ పరిశీలనల వివరాలు వెల్లడించారు. బిఎస్‌పి అభ్యర్థి తమ్ములూరి వెంకటరత్నం, వైసిపి అభ్యర్థి యడం బాలాజీ, టిడిపి అభ్యర్థి ఏలూరు సాంబశివ రావు, కాంగ్రెస్ అభ్యర్థి నల్లగోల శివశ్రీలక్ష్మీ జ్యోతి, పిరమిడ్ పార్టీ అభ్యర్థి బెండపూడి లోకేశ్వరరావు, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి బాచిన రాంబాబు, స్వతంత్ర అభ్యర్థులతో కలిపి మొత్తం 17మందిని ఆమోదించినట్లు తెలిపారు. ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించినట్లు ఆర్ఓ తెలిపారు. ఎన్నికల పరిశీలకులు ఖాజాన్ సింగ్, పర్చూరు, కారంచేడు, చిన్నగంజాం, ఇంకొల్లు, మార్టూరు, యద్దనపూడి ఎఆర్‌ఒలు సిహెచ్ సుబ్బయ్య, మెహెర్ బాబు, ఫణింద్ర బాబు, ప్రమీల, సంధ్యశ్రీ, వై నాగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ముస్లిములపై వైసిపి ఫేక్ ప్రచారం

ప్రజాశక్తి- మార్కాపురం రూరల్

వైసిపి పని కట్టుకొని టిడిపిపై బురద చల్లే ప్రయత్నం చేస్తుందని, దీన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పక చెప్తారని టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ మౌలాలి పేర్కొన్నారు. స్థానిక కంభం సెంటర్లోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి, బిజెపితో చేతులు కలిపి ముస్లిం సమాజం పట్ల నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తుందని, పట్టణంలోని ముస్లిం సోదరులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు. వైసిపి పాలకుల వల్ల నంద్యాలలో ఒక ముస్లిం కుటుంబం తన పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన యావత్ ముస్లిం సమాజం మర్చిపోలేదని అన్నారు. కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు ఇబ్రహీం ఖాన్, మొగల్ ఫిదా హుస్సేన్ బేగ్, పి గులాబ్ ఖాన్ ఖాన్, షేక్ మహబూబ్ బాషా, షానూర్ పాల్గొన్నారు.

కక్షపూరితంగా వ్యవహరిస్తారా?

ప్రజాశక్తి - రేపల్లె

జనసేన పట్టణ అధ్యక్షులు మహేష్

ప్రజలపట్ల కక్షపూరితంగా వ్యవహరించడం ఏమిటని జనసేన పట్టణ అధ్యక్షులు రాసిం శెట్టి మహేష్ ప్రశ్నించారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గత కొన్ని రోజులుగా సిద్దంపై జనసైనికుల యుద్ధం పేరుతో చేస్తున్న ఆందోళనలో భాగంగా రక్షిత తాగునీటి చెరువు వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. పట్టణంలో గత ఐదేళ్లుగా ప్రజా సమస్యలు పరిష్కరించటంలో వైసిపి విఫలమైందని ఆరోపించారు. పట్టణ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

అంగవైకల్యాన్ని జయించి..

ప్రజాశక్తి - పంగులూరు

ఓంకార్ వరుణ్

మండలంలోని రామకూర్ గ్రామంలోని తాతయ్య, అమ్మమ్మ ఆలనా పాలనా చూశారు. దీనికి తోడు అంగవైకల్యం కూడా ఉంది. లేచి నడవలేని పరిస్థితి అతనిది. అయినా చదువుకోవాలనే పట్టుదల అతనిని ముందుకు నడిపించింది. చదువు పట్ల ఆసక్తి, మనోధైర్యం జెఈఈ ర్యాంక్ వైపు నడిపించింది. జెఈఈ మెయిన్స్‌లో 1759వ ర్యాంక్ సాధించాడు. బాగా చదువు కోవాలి. చదువులో ముందుండాలనే పట్టుదలతో చదవటమే ర్యాంకు రావడానికి కారణమని ఓంకార్ వరుణ్ తెలిపారు. భవిష్యత్తులో మరింత బాగా చదివి తాతయ్య, అమ్మమ్మలకు మంచి పేరు తీసుకురావాలనేదే తన లక్ష్యమని చెప్పాడు. జెఈఈ మెయిన్స్‌లో ర్యాంక్ సాధించిన వరుణ్‌ను గ్రామస్తులు అభినందించారు.

'మాతృ వందనం' పురస్కారం

ప్రజాశక్తి - బాపట్ల

పద్య రచనలో భావి తరాల రచయిత్రులకు ఆదర్శంగా నిలిచిన యేడుపదుల వయసులో పద్య రచయిత్రి ముదిగొండ సీతారావమ్మకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాతృ వందనం పురస్కారాన్ని ప్రకటించినట్లు బాపట్లకు చెందిన ప్రముఖ కవయిత్రి ప్రత్తిపాటి సుభాషిణి విలేకరులకు తెలిపారు. పట్టణంలో సుభాషిని ఆధ్వర్యంలో ఈ ఏడాది మాతృ వందనం పురస్కారాన్ని ముదిగొండ సీతారావమ్మకు జిల్లా కవయిత్రుల తరుపున అందజేశారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు, సాహితీ వేత్త మల్లికార్జునరావు, కథా రచయిత్రి రాజేశ్వరి, ప్రముఖ ప్రజా వైద్యులు కవి శ్రీనివాస్, బాల కాత్యాయని, తేజస్వి, ఫణి ధూర్జటి పాల్గొన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్‌లో మంటలు..

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని మూలపాలెం గ్రామానికి చెందిన మిక్కిలి పాల్ రెండెకరాల వరిగడ్డిని ట్రాక్టర్‌పై జమ్ములపాలెం తీసుకెళుతున్న క్రమంలో వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయని అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వర్లు తెలిపారు. అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ గడ్డి మొత్తాన్ని రోడ్డుపై వదిలేశాడు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ప్రమాదవ స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. దీంతో ట్రాక్టర్‌కు అగ్నిప్రమాదం తప్పింది. రూ.20వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ట్రాక్టర్‌పై ఎత్తుగా గడ్డి లోడ్ చేయడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలిపారు.

శిక్షణ బృందం పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో గల భట్టిప్రోలు జిడిసిసిబి ఆధ్వర్యంలో నడుస్తున్న భట్టిప్రోలు, సూరేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను సహకార బ్యాంక్ ఫ్యాకల్టీ శిక్షణ బృందం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీఎం కె విజయ చంద్రారెడ్డి మాట్లాడుతూ బ్యాంకు పరిధిలో కంప్యూటరీకరణపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీ బృందం చేసిన అధ్యయనం ద్వారా తిరిగి సొసైటీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎస్ అరుణ, సూపర్వైజర్ డివిటిఎస్వి ప్రసాద్, సొసైటీ సీఈఒలు వేములపల్లి శ్రీనివాస్, బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసిన చంద్రబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

దళిత, గిరిజనులను చంద్రబాబు అవమానపరిచి మోసం చేశారని వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు దావూరి మల్లేశ్వరరావు ఆరోపించారు. ఆయన విలేకర్లతో శుక్రవారం మాట్లాడారు. దేశంలో బిజెపి పాలనలో నరేంద్ర మోడీ ముస్లిం, క్రైస్తవ మైనారిటీలపై అనేక విధాలుగా దాడులు, హత్యలు, మారణ కాండలు సృష్టించిన సమయంలో ఖండించే విధంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్, చంద్రబాబు నేడు అదే బిజెపితో కలిసి ప్రజలను మరో మారు మోసం చేసేందుకు పూనుకున్నారని ఆరోపించారు. దళిత, గిరిజనులు, బడుగు, బలహీన వర్గాల వారికి ప్రస్తుత ఎన్నికల్లో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి సుమారు 100 సీట్లపైగా కేటాయించారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం అందించిన జగన్మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు.

రేపు వేంపాడులో మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-ముండ్లమూరు

బోడపాటి హనుమంతరావు, యాళ్ల మోహనరావు ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ నెల 28న మ్యాక్స్‌కేర్ సాయితిరుమల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, నరసరావుపేట వారి ద్వారా ముండ్లమూరు మండలంలోని వేంపాడులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బోడపాటి హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరం నిర్వహిస్తారని పేర్కొన్నారు. వేంపాడు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ ఈ వైద్యశిబిరంలో పాల్గొని వారి సమస్యలకు తగిన సలహాలు, సూచనలతో పాటు పరిష్కారాన్ని పొందవచ్చునన్నారు. శిబిరంలో స్త్రీలకు గైనిక్ సమస్యలు, ఆర్థోపెడిక్, మెదడు, నరాలకు సంబంధించిన వ్యాధులతో పాటు సాధారణ వ్యాధులకు పరిష్కారాలు సూచించబడతాయని తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు.. అవసరమైన వారికి ఈసీజీ పరీక్ష చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి మందులు కూడా అందరికీ ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు. వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపిలోకి 120 కుటుంబాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి శుక్రవారం రాత్రి భారీగా చేరికలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి దామచర్ల సత్య, మాగుంట రాఘవరెడ్డి, కొండెపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో వైసిపి నుంచి 120 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో మండల జెసిఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, సీనియర్ నాయకులు నేలపాటి బాలశంకర్‌బాబు, మూలగుంటపాడు మాజీ ఉపసర్పంచ్ ముళ్ళపూడి సత్యనారాయణ, వైసిపి మైనార్టీ సెల్‌నాయకులు ఎస్‌కె.మున్నా, మాజీ ఎంపిపి యన్నాబత్తిన, మురళి, షేక్.జిలానిబాషల ఆధ్వర్యంలో 120 కుటుంబాలు టిడిపిలో చేరాయి. దామచర్ల సత్య మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్‌కు, కొండెపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా వచ్చిన వలసదారులను కొండెపి ప్రజలు ఒంగోలు పార్లమెంటు ప్రజలు నమ్మవద్దన్నారు. మైనార్టీలకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందన్నారు. యువ పారిశ్రామికవేత్త మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ కొండర్తైతే అటే (వైసిపిలో) ఉండి ఇటు (టిడిపికి) ఓటేస్తామని చెబుతున్నారని, అలా కాకుండా అందరూ తెలుగుదేశంలోకి రావాలని సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ అరాచక పాలనను అంతం చేసేందుకు అందరు ఏకమై పని చేయాలన్నారు. కార్యక్రమంలో వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, మించల బ్రహ్మయ్య, సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, సర్పంచ్ సైకం చంద్రశేఖర్, షేక్.సంధానిబాషా, చిగురుపాటి శేషగిరి, పరిశీలకులు అడకా స్వాములు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో

కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలు

రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-సంతమాగులూరు

వైసిపి ప్రభుత్వంలో కులమతాలకతీతంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కొమ్మాలపాడు గ్రామం నుండి ఏల్చూరు, పుట్టావారిపాలెం జంక్షన్ గుండా సంతమాగులూరు ర్యాలీగా ప్రత్యేక వాహనంలో చేరుకున్నారు. మార్గమధ్యలో ప్రజలకు అభివాదం తెలియజేస్తూ వాహనం ముందుకు సాగింది. అనంతరం సంతమాగులూరులో జరిగిన సభలో వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేయాలని, అద్దంకి ఎమ్మెల్యేగా పానెం చిన్న హనిమిరెడ్డిని, అలాగే బాపట్ల పార్లమెంటు సభ్యుడు నందిగం సురేష్ ని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు రీజనల్ కోఆర్డినేటర్ ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు మారం వెంకారెడ్డి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, వైవి భద్రారెడ్డి, స్థానిక నాయకులు ఓరుగంటి కోటిరెడ్డి, కారసాని వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మల్లపాలెం చెక్‌పోస్ట్ వద్ద

రూ.20 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండలంలోని మల్లపాలెం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా కారులో రూ.20 లక్షల నగదు శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు. మాచర్ల నుండి మార్కాపురం వెళుతున్న కారు నెంబర్ టిఎస్ 09ఈజె 9999 గల కారులో ఉన్న రూ.20 లక్షల నగదు, కారును స్వాధీనం చేసుకొని అజీజ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు రూ.50 వేలకు మించి తీసుకెళ్లరాదని, తగిన పత్రాలు కలిగి ఉండాలని, లేనిచో ఆ నగదును సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి పంపడం జరుగుతుందని తెలిపారు. నగదు స్వాధీనం చేసుకున్న

రూ.20 లక్షల నగదు ఉన్న కారు

విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ పి శ్రీలేఖ మల్లాపాలెం చెక్‌పోస్టును సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట యర్రగొండపాలెం, పుల్లలచెరువు ఎస్సైలు సుదర్శన్, ఎండి ఫిరోజా ఫాతిమా, స్క్వాడ్ సిబ్బంది ఉన్నారు.

క్విక్ పోలీసింగ్ కోసం 'సమర్థ్'

- ఎన్నికల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలకు యాప్ ఎంతో ఉపయోగం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

ముఖేష్ కుమార్ మీనాకు వివరిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు 'సమర్థ్' (సెక్యూరిటీ అరేంజ్‌మెంట్ మ్యాపింగ్ అనాలసిస్ రెస్పాన్ ట్రాకింగ్ హబ్) మొబైల్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. ఈ యాప్‌ను అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలు, సెక్టార్ ఆఫీసర్లు వినియోగించాలని ఆదేశించారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాని వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి బాపట్ల జిల్లాలో ఉపయోగిస్తున్న "సమర్థ్" మొబైల్ యాప్ విశిష్టతను, విశేషాలను వివరించారు. తమ జిల్లా ఐటి కోర్ విభాగం రూపొందించిన ఈ యాప్‌ను ప్రయోగాత్మకంగా ఈ నెల 22 వ తేదీ నుండి తమ జిల్లాలో వినియోగిస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు. మొత్తం జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది యొక్క వివరాలు, మొబైల్ నెంబర్స్ యాప్ నందు పొందుపరచబడినవని, తద్వారా పోలీస్ అధికారులు, సిబ్బంది యొక్క రియల్ టైమ్ లొకేషన్ ఎప్పటికప్పుడు ట్రాకింగ్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు సిఈఓలు పి.కోటేశ్వరరావు, ఎమ్.ఎన్. హరెంధిరప్రసాద్, బాపట్ల జిల్లా ఐటి కోర్ ఎస్సై నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

టిడిపి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి

23 డివిజన్‌లో దామచర్ల ప్రచారం

ప్రచారంలో దామచర్లకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

వచ్చే ఎన్నికల్లో తెదేపా గెలుపు అత్యవసరమని, ఇందుకు టిడిపి-బిజెపి-జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కూటమి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధన్‌రావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనార్దన్ 23వ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్‌కు చేరుకున్న దామచర్ల జనార్దనరావుకి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం లో భాగంగా దామచర్ల జనార్ధనరావు ఇంటింటికి వెళ్లి మహిళలు,యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు, డివిజన్ లో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేసి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మాటాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే ఆయన మళ్లీ సిఎం కావాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ చిన్నయోగయ్య యాదవ్ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం విధ్వంసం

వైసిపి పాలనలో రాష్ట్రం విధ్వంసమైందని, విశ్వసనీయత, నైతికత లేని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలిచారని టిడిపి ఒంగోలు పార్లమెంట్ కమిటీ సభ్యులు విమర్శించారు. ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఒంగోలు పార్లమెంట్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో "అరాచక పాలన అంతం - కూటమి పంతం" పేరుతో 50 అంశాలతో కూడిన ఎన్డీయే చార్జ్‌షీట్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు కామేపల్లి శ్రీనివాసరావు, ఒంగోలు పార్లమెంట్ కోశాధికారి పల్లపోతు వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరి వేంకటేశ్వర రెడ్డి, కార్యదర్శులు గంగవరపు పద్మావతి, దాయనేని ధర్మ, మీడియా కో ఆర్డినేటర్ బెజవాడ మురళి పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు వేసేలా అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వచ్చే నెలలో జరిగే సాధారణ ఎన్నికలలో అర్హులందరూ ఓటు వేసేలా జిల్లావ్యాప్తంగా విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ దిశగా ఒంగోలు నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం వెలుపల ఏర్పాటు చేసిన సైకత శిల్పాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రజలు కూడా చురుకుగా ఓటింగ్‌లో పాల్గొనేలా వివిధ రూపాలలో స్వీప్ కార్యక్రమాలు చేపట్టామన్నారు. విజయవాడకు చెందిన అంతర్జాతీయ గుర్తింపు పొందిన సైకత శిల్పి ఆకునూరి బాలాజీ వరప్రసాద్ ఈ సైకత శిల్పాన్ని నిర్మించినట్లు తెలిపారు. దాదాపు 30 టన్నుల ఇసుకతో రెండు రోజులలో దీనిని నిర్మించిన బాలాజీ వరప్రసాద్‌ను కలెక్టర్ ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు.

సైకత శిల్పాన్ని ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

సైకత శిల్పాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ బి.రవి, జ్యోతి, ఒంగోలు ఆర్డీవో జివి సుబ్బారెడ్డి, ఇతర స్వీప్ అధికారులు, స్వెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. మే13న అర్హులందరూ ఓటు వేసేలా రూపొందించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఒంగోలు నగరంలోని ప్రధాన సెంటర్ లో ఏర్పాటు చేసిన ఈ సైకత శిల్పం ఆ మార్గంలో వెళ్లేవారిని విశేషంగా ఆకట్టుకుంటున్నది. యువత ఆసక్తిగా సెల్ఫీలు దిగుతూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని ఉత్సాహం చూపుతున్నారు.